
(కథానిక)

# ఇన్‌సైడర్

డాక్టర్ వొద్దిరాజు వెంకటరామారావు



"మానవత్వం ఉండాలి! మనిషిలోని దైవత్వాన్ని ఆవిష్కరించుకోవాలి! ఈ జగత్తులోని చరాచరసృష్టి పట్ల కారుణ్య భావం వహించాలి! ఇదే మన భారతీయ జీవన దృక్పథం" అని ముగించారు ప్రొ॥ శాంతకుమార్, సభాసదుల కరతాళధ్వనుల మధ్య.

'ప్రపంచశాంతి'పై నగరంలో ఏర్పాటు చేసిన ఓ సదస్సు అది. ఒకవైపు మనసును స్పృశించే ఆధ్యాత్మికభావతరంగాలు. మరోవైపు శరీరానికి తాకే హుస్సేన్‌సాగర్ పాచీ వీచికల గాలులు. రెంటి మధ్య శ్రీరామకృష్ణమఠం, నిశ్చలయోగిలా ఉన్నది. రామకృష్ణమఠంలోనే ఈ సదస్సు జరుగుతోంది.

ఓ ఆంగ్లపత్రిక తరపున రిపోర్టర్‌గా వెళ్లిన నాకు ప్రొ॥ శాంతకుమార్ భావజాలం చిరపరిచితమే. సిటీలో జరిగే దాదాపు ప్రతి సదస్సులో ఆయన అతిథిగానో సభాధ్యక్షుడుగానో పాల్గొంటారు. వారి సభా కార్యక్రమాలే కాదు, వారుండే అపార్టుమెంటు కాంప్లెక్స్ ఉండే అవకాశం, ఓ సింగిల్ బెడ్ రూం ఫ్లాట్ కొన్నాక కలిగింది.

సభ ముగిసింది. తిరుగు ప్రయాణంలో శాంతకుమార్ గారు కార్లో లిఫ్ట్ ఇచ్చారు. దారిలో గ్లోబలైజేషన్, చరిత్ర వక్రీకరణ, సాఫ్రనైజేషన్, ఫిలాసఫీ, చరిత్ర, సాహిత్యం, రాజకీయం కాశ్మీరు సమస్య—ఒకటేమిటి ఎన్నో టాపిక్స్‌ను విశ్లేషిస్తున్నారు. మేమున్న ప్రాంతం ఉప్పల్.

అపార్టుమెంట్స్ చేరుకొని కారు డోరు తీసేసరికి, "భౌ" మంటూ ఓ వీధి కుక్క ప్రొఫెసర్‌గారి మీదకు దూకింది. వాచ్‌మేన్ ఓ పక్క, నేనో పక్క, మెల్లగా ప్రొఫెసర్‌ను



తప్పించాము.

"ఛా ఛా! ఈ వీధి కుక్కల్ని ఎందుకు రానిస్తున్నారు?" అని విసుగుతో, పైకి గట్టిగా కసిరాడు.

"లేదు సాబ్! అది ఈనిన కుక్క.. మెట్ల కింద పిల్లల్ని పెట్టింది" అన్నాడు వాచ్‌మేన్.

"సర్లే! ఆ కుక్క పిల్లల్ని, ఓ బ్యాగులోనో, సంచిలోనో వేసి దూరంగా పడేసి రావయ్యా!" అని సలహా ఇచ్చాడు.

"అమ్మో! గిప్పుడు దాని దగ్గరికి పోతే తోడ్కల్ తీస్తది."

"అలా అంటే ఎలా? ఇంతమంది వస్తూ పోతుంటారు. ఎంత ఇబ్బంది! మన కోసం వచ్చే వాళ్లని కరిస్తే?... ఎలాగైనా సరే ఆ కుక్కని ఇక్కణ్నుంచి వెళ్లగొట్టాలి!" అంటూ సీరియస్‌గా వెళ్లిపోయాడు శాంతకుమార్. ఆయన చెప్పితే చేయాల్సిందే. అపార్టుమెంటు బిల్డరూ ఆయనే, ఓనరూ ఆయనే.

"గా సార్ చెప్పినంత అల్క గాన? ఏదో పాపం ఈనింది. దాని కూనల్ని ఎత్తుకుపోతరని, దానికి భయం. కొన్నిరోజులైతే అవ్వే ఎటన్న పోతయ్. గిప్పుడు వాటిని ఎక్కడన్న పారేత్తె వాటి గోష తల్గద..." అని వాచ్‌మేన్ చిన్నగ తనలో తాను అనుకుంటూ నా వైపు చూశాడు.

వాచ్‌మేన్ చెప్పింది నిజమేననిపించింది. నేను మెట్ల వెపు చూశాను. ఆ వీధి కుక్క ఇంకా మా వేపే గుర్రుగా చూస్తు కూర్చున్నది. నేను మెల్లిగా తల వంచుకొని మెట్లు ఎక్కినా రూంలోకి వెళ్లి, కాస్త ఫ్రెష్ అయ్యాను.

అప్పటికే రాత్రి బాగా అయ్యింది. మెస్‌లు కట్టివేసిన సమయమది. ఏదైనా ఇరానీ హోటల్‌కెళ్లి బ్రెడ్డు తిని టీ తాగాలి అనుకొని, మళ్లీ క్రిందకు మెట్లు దిగివచ్చాను. అప్రయత్నంగా మెట్లకింది వైపు చూశాను. కాని తల్లి కుక్క లేదు. దాని పిల్లలు అక్కడే వున్నాయి.

బహుశః ఆహారం కోసం ఎటైనా వెళ్లి ఉండవచ్చు. హోటల్‌కు వెళ్లి తిరిగివస్తూ ఒక బ్రెడ్డు తీసుకొని వచ్చాను. తల్లి కుక్క అక్కడే ఉన్నది. పిల్లలు దాని మీద ఎగబడి, దాడి చేస్తూ పాలు తాగుతున్నాయి. తల్లికుక్క డొక్కలోపలికి పోయి, చర్మం లోంచి అస్థిపంజరం గూడు స్పష్టంగా కన్పిస్తుంది. మెట్లపై నుంచి బ్రెడ్ ముక్కలు తల్లికుక్క ముందు పడేటట్లు విసిరాను. ఆవురావురంటు తిన్నది ఆ కుక్క.. అది మొదలు, ఆ కుక్కకి నేను వేసే బ్రెడ్ ముక్కలే గతి అయ్యాయి.

నా భూతదయను గమనించిన ప్రొ॥ శాంతకుమార్ నన్ను వారించాడు.

"ఏమయ్యా, వీటికి అన్నం పెడితే, ఇక్కడే సెటిలయి పోతాయి. కాంప్లెక్సులో నీట్‌నెస్ పోతుంది. వాటి వల్ల వైరల్ ఫీవర్ వస్తుంది. అది కరిస్తే రేబిస్ లాంటిది వస్తే ఎంత కష్టం!" అని చిందులు తొక్కాడు.

కుక్కను తరిమివేసే ప్రయత్నంలో, అన్ని ఫ్లాట్ల వారూ సమాలోచన చేశారు. ఎవరినీ దరి చేరనీయడం లేదు కుక్క. అందరికీ పంతం పెరిగిపోయింది. "ఆఫ్టాల్ ఓ వీధి కుక్క" అని కసి పెంచుకొన్నారు. బడుగు దేశంపై అగ్రరాజ్యాలు దాడి చేసినట్లు, ఆ కుక్కను అందరూ ఏదో విధంగా వేధించే ప్రయత్నాలు మాత్రం మానలేదు. మనిషిలో ఇగో దెబ్బ తింటే పగ మొదలవుతుంది.

ఓ రోజు శాంతకుమార్ ఇంటికి చుట్టాలొచ్చారు. ఆ చుట్టాల తాలూకు పిల్లలంతా, గోలగోలగా సెల్లార్ అంతా అరుపులు, కేకలతో కిష్కింధకాండను మరపింపచేయసాగారు. తమ ఆటలకు కుక్క అడ్డంకిగా ఉందని భావించి, కుక్కను శాశ్వతంగా వెళ్లగొట్టే మాస్టర్ ప్లాన్ వేశారు. పథకం ప్రకారం కిటికీల్లోంచి దీపావళి బాంబులు, టపాకాయలు, ముట్టించి కుక్క పైకి విసురుతూ కుక్కకు ప్రాణభయం కలిగించారు.

తల్లి కుక్క, బాంబులకు భయపడి, అరుస్తూ, మొరుగుతూ ఏడుస్తూ పలాయనమైంది. సాయంత్రం వరకు బాంబుల కాల్చివేతను ఆపారు. రాత్రి అయ్యేసరికి కుక్క పిల్లలు పాల కోసం రోదించసాగాయి. తన పిల్లల్ని కనిపెట్టుతూ వీధి మలుపు వద్ద చెత్తకుండీ వెనకాలే నక్కిన తల్లి కుక్క మళ్లీ రాబోయింది. ఇది గమనించి సరిహద్దు రేఖలా నిలబడి మళ్లీ బాంబులు కాల్చారు అబ్బాయిలు. ఈ లోపు మరో బృందం కుక్కపిల్లల్ని సంచిలో బంధించి, దూరంగా వున్న పిచ్చి తుమ్మ పొదల్లోకి విసిరేశారు. విజయవంతమైన 'ఆపరేషన్ డాగ్' సైనికచర్యని బాల్కనీ లోంచి ప్రొ॥ శాంతకుమార్, తదితరులు చిద్విలాసంగా నవ్వుతూ చూసి, అబ్బాయిల్ని అభినందించాడు.

వాచ్‌మేన్, తెగ బాధ పడిపోయాడు. "చూసిన్రా సార్! పోరగాళ్ల పని. మస్తు పాపం తగులుతది" అన్నారు.

తల్లి కుక్క, వాసనతో నేలంతా తడిమి చూస్తూ వెళ్లి తుమ్మపొదల్లో పడేసిన తన కూనల్ని గుర్తు పట్టింది. అక్కణ్నించి, తన కడుపు నింపుకోడానికైనా బయటికి వెళ్లకుండా, కొన్ని రోజులు తన పిల్లల వద్దే కాపుగా ఉన్నది. ఎముకల పోగుగా మారిన ఆ తల్లి కుక్క నడుస్తుంటే శోష వచ్చి తూలిపోసాగింది. కూనలు మాత్రం ఎండిపోయిన పొదుగుల్ని పీల్చి, పాలు దొరక్క దిగాలు పడి, మట్టి, చెత్తాచెదారం నాకుతూ సమాజంలోకి రాసాగాయి.

ఓ రోజు బ్రహ్మాండమైన వర్షం మొదలై ముసురుగా మారింది. పొదల్లో కుక్కపిల్లలు ముడుచుకొని పోయి వణకసాగాయి. వానకు భయపడిన తల్లి కుక్క గజగజ వణకసాగింది. దాని శరీరంలోని ప్రాణాలు కేవలం కళ్లలోనే చేరాయి. అకస్మాత్తుగా పందుల గుంపొకటి వచ్చి, కుక్క కూనలపై పడి కరవనారంభించాయి. తల్లి కుక్క పౌరుషంగా పోరాడి విడిపించుకొంది. కుక్కకూనలు రక్తసిక్తమయిన శరీరాలతో వానలో వణకసాగాయి. కొన ప్రాణంతో ఉన్న ఆ కూనల్ని మందో మాకో ఇచ్చి రక్షిస్తే బావుణ్ను అనిపించింది. గొడుగు, టవల్‌తో కిందకు వెళ్లబోతుంటే, శాంతకుమార్ కంఠం వినిపించింది కటువుగా. "ఆ కుక్కల్ని మాత్రం ఇంట్లోకి తేకూడదు! ఐ డోన్ట్ టాలరేట్!"

"లేదు సార్, పందులు వాటిని దారుణంగా కొరికాయి. వెటర్నరీ క్లినిక్‌కు తీసుకెళ్తితే పాపం బ్రతుకుతాయేమో! ఈ రాత్రికి మన మెట్ల కింద ఉంచి పొద్దున వదిలిపెడ్తాం!" అన్నాన్నేను.

"ఇదో న్యూసెన్స్. ప్రతి ప్రాణిని బ్రతికించాలంటే మన తరం కాదు. అపార్ట్‌మెంట్లోకి మాత్రం రానిచ్చేది లేదు!" అన్నాడు శాంతకుమార్ కటువుగా.

మళ్లీ వర్షమెక్కువై, విద్యుత్సరఫరా నిలిచిపోయింది. అంతా చీకటి. ఏదో అశక్తత. ఫ్లాట్సులో కలిసి ఉన్నట్లు కన్పించే కలవని రైలు పట్టాల వంటి బ్రతుకులు. భిన్న దృక్పథాలు. భిన్న ఆలోచనలు. భిన్న సంస్కృతులు. కొన్నింటిని త్యాగం చేయాల్సి ఉంటుంది. రాత్రంతా అసహనంగా నిద్ర పోలేకపోయాను.

తెల్లారింది. బారెడు పొద్దెక్కేసరికి మెలకువ వచ్చింది. లేచి కళ్లు నులుముకుని, కిటికీలోంచి చూశాను. వర్షం వెలిసింది. రాత్రి గాలివానకు, అశోక చెట్టు పడి తల్లి కుక్క చనిపోయి వున్నది. దాని డొక్కలో కుక్కకూన మాత్రం బ్రతికే వుంది.

గబగబ లేచి డ్రెస్ చేసుకొన్నాను. తెలిసిన వెటర్నరీ డాక్టర్ వద్దకు ఆ కుక్కకూనను ఇచ్చి వచ్చాను.

యథాలాపంగా పేపర్ మరలేస్తూ జిల్లా ఎడిషన్లో వార్త చూశాను. జంతుదినోత్సవసందర్భంగా జీవకారుణ్యానికి పాటుపడినందుకు ప్రొ॥ శాంతకుమార్ గారికి సన్మానమని, ఏదో ప్రభుత్వపురస్కారమని.

అపార్టుమెంట్‌లోని వారంతా శాంతకుమార్‌ను అభినందిస్తున్నారు.